# పల్లె పట్టులు

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

రణం గుర్నాథంగారింటికని బయలు దేరిన వెంకట్రామయ్య సందుమలుపు తిరగటంతో సత్యన్నారాయణగారింటి అరుగుమీద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న వాళ్ళందరిదృష్టి నాకర్షించాడు.

"తిమ్మిని బ్రహ్మిని చేసి ఆ శివయ్య పొలం బేరం ఫైసలు చేయించుకోంది మనలాడు నిద్దరోడనుకో..." అన్నాడు శేషయ్యగారి వెంకటేశ్వర్లు, 'దారె' పోతున్న వెంకట్రామయ్య వైపొకసారి చూచి వెంటనే చూపు మార్చి నేలచూపులు చూస్తూ.

"విన్నేనురా, సన్నాసీ!"అని మందలించాడు వయసుమీరిన సీతారామయ్య.

"మీన మేషాలు లెక్కపెట్టే ఈయనేం కొంటాడ్రా! సుబ్బరామయ్యకి, బేరం ఫైసలైపోయిందిట..." పెదసుబ్బయ్య సన్నగా వదిలాడు వార్తను.

"ఊఁ... అదిమాత్రం ఎక్కడ పూర్తయింది... అదీ నలుగుతోంది...నిన్ననేగా ఏదో మాటామాటామీద శివయ్య అంది..." అన్నాడు వెంకటకిష్టయ్య. కాళ్ళు ముడిచి నడుంచుట్టూ చుట్టిన కండువాని బిగదీస్తూ.


"అందుకనే కాబోలు వెంకట్రామయ్య మామ కరణంగారింటి చుట్టూ కాలుగాలిన పిల్లిలాగా తెగతిరుగుతున్నాడు! ఇహ మామ నిద్దరోడు!" వెంకటేశ్వర్లు తెలియజెప్పాడు.

"ఎందుకొచ్చిన మాటలు, ఊరుకోండి.. ఎవళ్ళుమాత్రం వీధులు కట్టి విస్తళ్ళు వేస్తున్నారట కాని..."సీతారామయ్య వాక్యం పూర్తిచెయ్యకండానే కాండ్రించి ఉమ్మేసి లేచి వెళ్ళిపోయాడు.

సీతారామయ్య నిష్క్రమణతో ఈ విషయాన్నిగురించిన వాళ్ళ సంభాషణ ఒకవిధంగా ఆగిపోయింది.

గుర్నాథంగారింటినించి తిరిగొస్తున్న వెంకట్రామయ్యను చూచి "ఏదో అడ్డుపుల్ల వేసొచ్చుంటాడు." అన్నాడు వెంకటకిష్టయ్య చేతికర్రతో నేలను పొడుస్తూ.

నిజానికి, వెంకట్రామయ్య అడ్డుపుల్ల వెయ్యానూలేదు; ఏమీ లేదు. గుర్నాథం పంతులు వూరునుంచి ఇంకా తిరిగిరాలేదని మంగమ్మ చెప్పేసరికి వెంకట్రామయ్య సగం దిగజారిపోయాడు. దీన్ని, ఎలాగో తట్టుకుని, "ఐతే, అమ్మాయ్! ఎక్కడికెళ్ళిందీ తెలుసా?" అనేసరికి "తెలీదన్నయ్యా! దస్తరంకట్ట తీసుకుని పొద్దునంగా వెళ్ళారు శివయ్యా, ఆయనాను... మధ్యాహ్నం భోజనానికికూడా ఇంటికి రాలేదు. ఎక్కడికెళ్ళారో ఏమో..." అని పిడుగులాటి వార్త బయటపెట్టేసరికి శివయ్యపొలం వ్యవహారం తను తెగేదాకా లాగానేమో నని తన్నుతాను నిందించుకోవటం మొదలు పెట్టాడు వెంకట్రామయ్య.



మారుమాట లేకుండా నిలబడిపోయిన వెంకట్రామయ్యను అంతతొందరగా పంపెయ్యటం ఇష్టంలేని మంగమ్మ మినుములు బాగుచేస్తున్న పీటను ఒళ్ళోనుంచి తీసి అవతల పెట్టి, జారగిలబడి అరుగుమూల నున్న చాపను అందుకుని ఇవతల పడేస్తూ, "కూచో అన్నయ్యా!" అంది.

"లేదు, వెళ్ళాలమ్మాయ్!" అంటూ చాప పరుచుకు కూర్చుని "గుర్నాథం వచ్చివుంటాడేమో నని వచ్చాను" అన్నాడు స్తంభాన్ని ఆనుకుని, వేళ్ళతో స్తంభంపైన దరువువాయిస్తూ.

"పాపం, రెండుసార్లు వచ్చావు. ఏమన్నా తొందర వ్యవహారమా?" అంది, తీవ్రంగా భావపరిశీలన చేస్తున్నట్లు వెంకట్రామయ్యముఖంలోకి చూస్తూ.

"అదే తొందర...." వెంకట్రామయ్య నీళ్ళు నమిలాడు.

"ఏటవతల పొలం అమ్మకొచ్చినట్టున్నావు... ఇక్కడెక్కడన్నా మళ్ళీ పొలం కొంటావా? లేక, ధరలు తగ్గేదాకా అలాంటి ఆలోచన లేమీ లేవా?" అంటూ తనే విషయంలోకి వచ్చింది, పీట ఒళ్ళో పెట్టుకుని మళ్ళీ మినుములు బాగుచేస్తూ.

వెంకట్రామయ్య ఇంకా స్తంభంమీద దరువు వాయిస్తూనే ఉన్నాడు నెమ్మదిగా, ఏదో ఆలోచిస్తూ. సమాధానంగా పరిస్థితు

లన్నీ విడమర్చి ఆవిడకి చెప్పవలసిన అవసరం కూడా ఏమీ లేదనుకున్నాడు.

ఇంకా, ఆయనదగ్గరనుంచి సమాధానమేమీ రాకపోయేసరికి "అఁ హఁ...ఎందుకంటున్నానంటే... ఈరోజుల్లో ఎవ్వణ్ణీ నమ్మి ఎట్టుని ఏగానీ చేతులో పెట్టటానికి వీలుగాకుండావుంది...ఆ పేట్టాజు మొహాన పోసిన అప్పుకి ఇంతవరకు అయిపూ మోక్షం లేక మేం పడుతున్న అవస్థ నువ్వూ చూస్తున్నావుగా..." అని, తనిలా మాట్లాడటానికి తగదేనని నిరూపించి "అభమూ, శుభమూ ఎరగని పసివెధవల సొమ్ము...వీలుచూసి ఓ యింత పొలం కొని పడేస్తివా, నాలు కాలాలపాటు పడిఉంటుంది" అంటూ తన అల్లుడు ఆస్తినంతనీ ఎలా వెనకముందులు తెలీకుండా హ్రస్వంచేసిపోయిందీ, తనకూతురుకుటుంబాన్ని అష్టకష్టాలూ పడి తను ఎలా ఒక దారికి తీసుకొస్తున్నదీ వెంకట్రామయ్యకు మరొకసారి జ్ఞాపకానికి తెప్పించింది.

ఇలా మంగమ్మ ఒక్కతే మాట్లాడుతుంటే తను మెదలకుండాయూరికే ముడుచుకు కూర్చుండటం బాగుండదని "సరే...కలిసిరాంది, ఊరికే తొందరపడితేమాత్రం పనులౌతయ్యా!" అన్నాడు.

నిజానికి, వెంకట్రామయ్య ఇప్పుడు విచారపడుతున్నది, తను తొందరపడకపోవటంవల్ల పని అయే అవకాశం జారవిడుచుకున్నానేమో నని!

చేలో చేను కలుస్తోందిగనక శివయ్య పొలం కొంటే తనే కొనాలనీ, చుట్టుపక్కలెవరూ మోతుబరిరైతులు లేరుగనక బేరం విషయంలో తనేమీ అంత తొందర పడక్కర్లేదనీ అనుకుంటున్నవాడల్లా, సుబ్బరామయ్య బేరం ఫైసలు చేయించుకునేట్టున్నాడని తెలిసేసరికి వెంకట్రామయ్యలో ఒక విధమైన తొందర బయలుదేరింది.

"పోనీ, శివయ్య పొలం బేరం పెడుతున్నాట్ట... అదేదో చూడరాదూ... చేలో చేను కలుస్తుందల్లే వుంది కూడాను" అందిమంగమ్మ బయటపడి, చివరికి. మంగమ్మకి విషయాలన్నీ తెలిసుండికూడా తెలీనట్టు మాట్లాడుతున్నదని వెంకట్రామయ్యకు అనుమానంగానే వుంది. "మొన్న నేనో ఆ మాటా ఈ మాటా చెపుతూ మీ బావకూడా అదే అన్నారు..." అని, ఇంట్లో ఏదో పడ్డట్టు చప్పుడయేసరికి, "అమ్మాయ్! ఇంట్లో ఉన్నావుటే!" అని, సమాధానం రాకపోయేసరికి "ఇప్పుడే వస్తా" నంటూ లోపలికి వెళ్ళబోయింది మంగమ్మ.

సమయం చూసి వెళ్ళిపోదా మనుకుంటున్న వెంకట్రామయ్య కూడా లేచి "నేనూ వెడతానమ్మాయ్! ఈ విషయమే మాట్లాడదామని వచ్చాను" అని బయటపెట్టాడు.

"శివయ్యగారింట్లో మరీ గొడవగా వుంది విన్నావా? పొలం అమ్మేతానన్నాడని వియ్యమ్మ కొడుకుమీద అలిగి...నిన్నా, ఇవ్వాళా ఉపోషాలుట !- చేదనూతుల్లో పడిపోతే గాలంకావలసివచ్చి గొడవగా చెప్పిపోయింది కామాక్షమ్మ, ఇందాక..."

తను ముఖ్యంగా చెప్పదల్చుకున్న ఈ నాలుగుమాటలూ చెప్పికాని, వెంకట్రామయ్యను వెళ్ళనిచ్చి తను ఇంట్లోకి అడుగుపెట్టింది కాదు మంగమ్మ.


దీని కంతకూ తనెంతవరకు బాధ్యుణ్ణని తన్నుతాను ప్రశ్నించుకోకుండా వుండలేకపోయాడు వెంకట్రామయ్య దారిపొడుగునా. ఎలాగో శివయ్యను మాయజేసి ఆ పొలంకాస్తా కాజెయ్యాలని తాను కలలో కూడా అనుకోలేదు. ఎకరం రెండువేల అయిదువందలకు మించి తనేమాత్రం ధర పెట్టదల్చుకోలేదనీ, అలా వీలైతే శివయ్య అమ్మదల్చుకున్న కలవగుంట పొలం - మూడెకరాల పాతిక సెంట్లూ తను కొనటానికి సిద్ధంగా ఉన్నాననీ.. తన మనసులో ఉన్నదేదో గుర్నాథంతో తేల్చి చెప్పేశాడు వెంకట్రామయ్య. అంత మాత్రానికే తనని ఊరంతా ఇలా ఆడిపోసుకోవటం దెందుకు? ఇందాక, నడిబజార్లో కూర్చున్నవాళ్ళంతా తననిగురించే ఏదో అనుకుంటున్నారని వెంకట్రామయ్యకి తెలుస్తు. ప్రపంచాన్ని చాలా చూసిన మనిషిగనక - తనని మినహాగా ఇతర్లనం దర్నీ లెక్కచెయ్యటం లోకసహజమే లెమ్మని సమాధానం చెప్పుకోగలిగాడు.

వెంకట్రామయ్య ఇంట్లో అడుగుపెట్టేసరికి భార్య మహాలక్షుమ్మ ఎవరినో తెగ తిట్టిపోస్తోంది. ఆవిడ అనే మాటలన్నీ శివయ్యతల్లి వియ్యమ్మనని, జాగ్రత్తగా ఆ తిట్లు కొద్దిక్షణాలసేపు విన్నతరవాతకాని గ్రహించలేకపోయాడు వెంకట్రామయ్య.

"...నా కూతురు ఖర్మ కాలిందిసరే... తను మాత్రం?... పట్టుమని పదేళ్ళన్నా కాపరం కాలబెట్టకుండా తనెందుకు ముండమోసిందంట! తనెవరి ఆస్తులు కలుపుకుందామనుకోబట్టి ఇలా అయిందో!... పెద్దముండ అనాల్సిన మాటలేనా ఇవి?... ఏళ్ళు రాంగానే సరా!..."

వెంకట్రామయ్యభార్య మాటల్లో చొరబడి "ఏమిటే ఆ గొడవ? ఏమిటలా చిందులు తొక్కుతావ్?" అన్నాడు రుంజుకుంటూ.

అంతవరకు భర్త ఇంటికి వచ్చినట్లు గ్రహించని మహాలక్షుమ్మ గబగబా నిచ్చెన దిగి "ఏమిటా?...మీ బొందా, నా బొందాను!...అసలా దిక్కుమాలిన పొలం బేరం నాకు మొదటినించీ ఇష్టంలేదు! కొనే దిక్కులేక ధరలు రాకపోతే...మన్ని చూసి కళ్ళల్లో నిప్పులుపోసుకుంటే ఏం లాభం? అంత నష్టపోతున్నా మనుకుంటున్నప్పుడు



ఆ విషయం కొడుకుతో చెప్పరాదా, నాలుగు చెప్పుదెబ్బలు వాడే కొడితే పడరాదా!..."

ఇలా, మహాలక్ష్మమ్మ నోటికి వచ్చినట్లల్లా, మాట్లాడుతుందే. వెంకట్రామయ్య పట్టలేక "ఇహ చాల్లే, నోర్మూయ్యి!... ఏం? మహా నోర్లేస్తోంది..." అని గదమాయించేసరికి మహాలక్ష్మమ్మ పితూరీచేస్తున్న ధోరణిలో "పెళ్లూ పెళ్లూ నోటికి వచ్చినట్టల్లామాటలంటుంటే పడటం మీకు బాగుంటుంది కాబోలు నేం?...ఇందాక, అలా కాస్సేపు కూచునివద్దామని అమ్మాయిగారింటికి పోదును గదా, గుమ్మంలో గుమ్మం... ఆ రామ్మూర్తిగారి అరుగుమీద చేరి ఒక తిట్టు కాదు ఒక మాట కాదు...అట్లా ఆడిపోసుకుంటే ఊరుకోవట్మానికెవరికేంఖర్మ కాలింది!..." అంది

వెంకట్రామయ్యకూడా భార్యకోపం అర్థం చేసుకున్నట్లు "పొలం అమ్ముతున్న కొడుకు మంచివాడే...ఎటొచ్చీ కొనే వాళ్లే నన్నమాట..."

మహాలక్ష్మమ్మ భర్తని వాక్యం పూర్తి చెయ్యనియ్యకండానే "ఆఁ!....మరేమిటి? శాణాతనమంటే!..." అని ఒక నొక్కు నొక్కి, కూడా బలుకుతున్నట్టు, "ఆ కొడుకునమాత్రం గుక్కతిప్పుకోనిస్తోందా యేమిటి? వియ్యామ్మ గయ్యాళితనం ఊరికి కొత్తా?..." అని, చేతిలో ఇముడ్చుకున్న కట్టిపేళ్లు తీసికెళ్లి వంటింట్లో పడేసి క్షణంలో చక్కా వచ్చి, "చేతిలో డబ్బుండాలిగానీ ఊళ్లో పొలాలకికరువొచ్చిందా? అంత ఉసురుగొట్టుపొలం. ఊరికే ఇచ్చినా మన కొద్దు బాబూ!" అంది.

అవసరమైతే కొంచెం ధర పెంచి అయినా పొలం తను కొనాలనుకుంటున్న వెంకట్రామయ్యకు ఈ మాటలేవీ రుచించలేదు.

"సరేలే... నువ్వెళ్లి వంటకానిచ్చు. పొద్దుపోయింది" అని వసారాలో మంచం వాల్చుకుని కూర్చున్నాడు. తను కొందామనుకున్న పొలం ఇలా అన్నింటాలా నలుగురులో పడటంతో ఆయన విచారపడకండా ఉండలేకపోయాడు. కొనటం అంటూ ఉంటే తనకి ఆ పొలం చాలా అనువైనదన్న విషయం ఎవ్వరూ కాదనలేరు. గుర్నాథం ఊరునుంచి రాగానే చెప్పి కొంచెం అటూ ఇటూగా బేరం ఫైసలు చేయించుకోవాలని నిశ్చయానికి వచ్చి ఆలోచిస్తూ పడుకున్నాడు వెంకట్రామయ్య.

ఇంతలో కరణంగారు రమ్మంటున్నారని కబురు వచ్చేసరికి స్పృహలోకి వచ్చాడు వెంకట్రామయ్య. తలుపు వేసుకోమని బయటినించే కేక వేసి దారినిపడ్డాడు.

గుర్నాథం తనతో మాట్లాడగల విషయాలనుగురించి పరిపరి విధాల దారిపొడుగునా ఆలోచిస్తూనే వున్నాడు వెంకట్రామయ్య. అవసరమైతే తప్ప తనుమాత్రం ముందు బయట పడకూడదనుకున్నాడు మళ్ళీ.

అరుగుమీద కరణంగారి మనమరాలు దీపంముందు కూర్చుని ఏదో చదువుకుంటున్నది. వెంకట్రామయ్య "తాతయ్యున్నాట్టే అమ్మాయ్!" అంటుండగానే గుర్నాథం లోపలినుంచి వచ్చి "అమ్మాయ్! సుగుణా! నువ్వు లోపలికెళ్ళి చదువుకో, పో..." అని మనమరాల్ని లోపలికి పంపి "రా! బావా! రా!" అంటూ తనుకూడా వచ్చి చాపపైన కూలబడ్డాడు.

"ఊరు వెళ్లావుటే..." అంటూ వెంకట్రామయ్య సంభాషణకి ఉపక్రమించాడు.

"ఆఁ... అదే... మరెక్కడికో కాదు. రెవిన్యూ ఇన్స్పెక్టరు కబురంపితేను, నిడుమోలు వెళ్లాను" అన్నాడు ముఖం చిట్లించి కాలి వేళ్ల మిటికెలు విరుస్తూ. "మధ్యాన్నం రెండుసార్లు వచ్చి వెళ్లావుటగా? చూశావా? నేను అన్నంతా అయింది. సుబ్బరామయ్య పొలం కొనటానికి సిద్ధంగా వున్నాడు..." అంటూ సూటిగా విషయంలోకి వచ్చాడు.

"నేనూ అందుకే వచ్చాను" అన్నాడు వెంకట్రామయ్య తన్ని తాను నిందించుకుంటున్న ధోరణిలో. ఇంకా ఏపాటి వీలున్నా తను ఎకరం రెండువేల ఏడువందలదాకా పెంచదల్చుకున్నానని చెపుదామనుకున్నాడు. కాని, ఇంతలో "నీకిష్టమైతే, నే నొక్క సలహా చెపుదామనుకుంటున్నాను..." అంటూ గుర్నాథం వెంకట్రామయ్యముఖంలో చూచేసరికి, వెంకట్రామయ్య తన తొందరంతా దిగమింగి... చెప్పమన్నట్లు గుర్నాథంవైపు ఔత్సుక్యంతో చూశాడు.

గుర్నాథం కొంచెం తాపీగా ప్రారంభించాడు: "కాస్తకీ, కూస్తకీ కక్కుర్తి పడి నువ్వు ఆ పొలం చెయ్యిజార్చుకోవటం నాకేమాత్రం ఇష్టంలేదు. అందుకనే సుబ్బరామయ్య బేరం తొక్కిపట్టి వుంచాను. ఐతే, నువ్వు శివయ్యవిషయంకూడా కొంచెం గమనించాలి - వాడూ కష్టాల్లో వుండి అమ్ముతున్నాడు. అమ్మితేనేనంగానే ఎగబడి వస్తున్న పెద్ద బేరాలు లేవనుకో... ఐనా, ఆగడ్డలో పొలమే మూణ్ణెల్లక్రితం రామకోటయ్య ఎకరం మూడువేల మూడొందల చొప్పున అమ్మిన విషయం మనమంతా ఎరుగున్నదే... వెంకట్రామయ్యా! నా అభిప్రాయం చెప్పాలంటే శివయ్యను ఎకరం రెండువేల అయిదు వందలకి అడగటం ధర్మం కాదు..." అంటూ గుర్నాథం తన మనస్సులో ఉన్న విషయమేదో బయటపెట్టాడు. ఉన్న రహస్యం చెప్పాలంటే గుర్నాథానికున్న ఈఅభిప్రాయంవల్లనే శివయ్య తన పొలాన్ని రెండువేల అయిదువందలచొప్పునే అమ్మవలసివస్తే వెంకట్రామయ్యకి మాత్రం అమ్మవద్దని శివయ్యకి సలహా ఇచ్చాడు!

ఇంకా ఏమి చెపుతాడోనని కూర్చున్న వెంకట్రామయ్యతో "నీకు నచ్చితే... మీకెవ్వరికీ కష్టంలేని ఒక మార్గం చెప్తాను- శివయ్యపొలం మూడువేలచొప్పున ఖరీదు చెయ్యి. కాకపోతే, రాతకోతలుమాత్రం ఎకరం పదిహేనువందలకో, రెండువేలకో కొన్నట్లు రాసుకోండి. నువ్వు ఎక్కువ పెట్టాననుకునేవార స్టాంపు డ్యూటీలో కలిసివస్తుంది..." అన్నాడు గుర్నాథం వెంకట్రామయ్యముఖంలోకి చూస్తూ.

గుర్నాథం ఇచ్చిన ఈ సలహా చాలావరకు సబబుగానే కనపడింది వెంకట్రామయ్యకు. దీనివల్ల తను అదనంగా పెట్టవలసిన ఖర్చు చాలా తక్కువ. ఐనా, బేరం ఆడటం మంచిదని చిట్టచివరికి ఎకరం రెండువేల ఎనిమిదివందలకు ఫైసలు చేయించేట్టు గుర్నాథాన్ని ఒప్పించాడు.

భోజనానికి లేచి మడికట్టుకోమని గుర్నాథానికి ఇంట్లోనుంచి రెండోపిలుపు కూడా వచ్చేసరికి వెంకట్రామయ్య సంభాషణ చాలించి బయటపడ్డాడు.

పొలంబేరం సంతృప్తికరంగా ముగియటంతో...గుర్నాథం ఈ చక్కని ఉపాయం బయటపెట్టకముందే తను తొందరపడి ధర పెంచుతానని చెప్పనందుకు తన్ని తానే అనేకవిధాల అభినందించుకున్నాడు. అలాగే ఆ రాత కోతలు కాస్తా పూర్తిఅయితే "అమ్మయ్య!" అనుకుంటాను అనుకున్నాడు.

(27-వ పేజీ చూడండి)


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిస్త్రాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. వి. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

# పల్లెపట్టులు

(18-వ పేజీ తరువాయి)

అలాగే కాగితాలు వ్రాసి రిజిస్టరు చేసుకున్నది మొదలు వెంకట్రామయ్య మాత్రం "అమ్మయ్య!" అనుకున్నాడు కాని శివయ్య మాత్రం అనుకోలేకపోయాడు. అతిప్రమాదకరమైన పని చేసినట్టు... ఏదో తెలీని భయం అతన్ని పట్టుకు పీడించింది. ఒంట్లో ఉన్న సత్తువ దిగజారిపోయినట్టు, కాళ్ళు నేలకు అంటుకుపోతున్నట్లు, అనిపించి కూర్చున్న చోటనే కూర్చుండిపోవటం- ఇలా ఆ రోజంతా పరధ్యాన్నంగానే ఉన్నాడు.

కొడుకు పడుతున్న మనోవ్యాధ యేమీ గమనించని వియ్యమ్మ సాయంత్రం శివయ్య ఇంటికి రాగానే "పొదుగుకోసి పాలు తాగుదామన్న ఈ దుర్బుద్ధినీకే పుట్టిందా? ఎవరన్నా చెప్పి పెట్టారా! నాకడుపులో చిచ్చు పెట్టావురా! కడుపు మాడి నేను కాస్త హరీ మంటేనేకాని అసలు ఈ ఇంటికి పట్టిన శని విరగడైపోదు... కానీలే ఇదెందు కొచ్చిందో!..." ఇలా ఎడతెరిపి లేకండా సాధించిపొయ్యటం మొదలుపెట్టింది.

శివయ్యకు విచక్షణాజ్ఞానం నశించింది. "చస్తే చావు! పీడ వదుల్తుంది" అంటూ తను అప్పుడే మంచినీళ్లు తాగి కింద పెట్టిన గుండుచెంబు ఎత్తి వియ్యమ్మపైకి విసిరాడు. వియ్యమ్మ రెక్కగూటికి బలమైన గాయం తగిలి కెవ్వుమని ఏడుస్తూ కింద పడిపోయింది. వంటింట్లోనుంచి భార్య పరుగెత్తుకొచ్చింది ఇంతలో చుట్టుపక్కలవాళ్ళు నలుగురూ పోగయ్యారు.

నలుగురూ నానామాటలూ అంటూంటే శివయ్య ఎలాగో అక్కడినుంచి బయట పడ్డాడు. రాత్రి భోజనానికి కూడా ఇంటికి వెళ్ళలేదు.

ఊరిబయట గొడ్లపాకలో పడుకున్నాడు. తల్లిమీదికి చెంబు విసిరిన మరుక్షణంనుంచి తనమీద తనకే పరమ అసహ్యం వేసింది. చుట్టూ చేరిన పంచాయతి దారులందరికీ తన మనసును గ్రహించగల శక్తి లేదని తనకి తెలుసు.

ఎంత ప్రయత్నించినా కంటిమీదికి కునుకు రావటంలేదు శివయ్యకు.

ఆరోజున తను చెయ్యరాని అపచారం చేశానని పరిపరివిధాల పశ్చాత్తాప పడ్డాడు. తల్లి స్వభావం తెలిసుండికూడా తొందర పడకండా ఉండలేకపోయానని తన్ని తాను నిందించుకున్నాడు. ఈ అప్పంతా తను చేసింది కాదే... ఉన్న అప్పు ఏ కాడికైనా తెగటార్చుకోవలసిన అవసరం ఆవిడకి మాత్రం తెలీమా? గంగిగోవులాంటి భూమి మీద ఉన్న మమతకొద్దీ అలా అంటోంది కాని... అమ్మటానికి ఇలా అంజాయించబట్టే వడ్డీలకి వడ్డీలు పెరిగి అప్పు ఇంతై కూర్చుంది!

శివయ్యకు తను అమ్మిన భూమివిషయం మర్చిపోవటం దుర్లభమైంది. ఇకనుంచీ ఆ భూమి తనది కాదన్న విషయం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కన్నతల్లిని ఖూనీచేసినంత దిగులు, భయమూ వేసేవి. ఏ పనీ చెయ్య బుద్ధి పుట్టేదికాదు.

అనుకోకుండానే రోజుకి ఒకసారన్నా పొలంవైపు వెళ్ళి చూసి వస్తూఉండేవాడు. తను కష్టాల్లో ఉన్న సమయం కనిపెట్టి తొక్కిపట్టి వెంకట్రామయ్య ఆ పొలం తన చేత రాయించుకున్నాడనిపించేది. వెంకట్రామయ్యంటే పట్టరాని అసహ్యం ప్రారంభమైంది శివయ్యలో.

రామకోటయ్య తన పొలం ఎకరం మూడు వేల మూడువందల చొప్పున అమ్మగా లేంది, వెంకట్రామయ్య తన పొలం ఎకరం రెండు వేల ఎనిమిదివందల చొప్పున కొన్నాడంటే ఆయన చాకచక్యం గాకపోతే మరేమిటి? బ్రహ్మప్రళయంమీద వప్పుకున్న ఆ రెండువేల ఎనిమిదివందలధరైనా ఎకరం పదిహేను వందల చొప్పున రాసుకోవటంవల్ల స్టాంపుడ్యూటీలో కలిసొచ్చిన డబ్బు తప్పితే ఆయన ఎక్కువ పెట్టిన ధర ఏముంది?

ఊళ్లో అందరికంటె ముందు నాగలి కట్టి శివయ్య నారుమళ్ళకు ఆ పొలందున్ని వచ్చాడు! ఈ విషయం ఊరంతా ఆగుబ్బుగా చెప్పుకున్నారు. మర్నాడు వెంకట్రామయ్య తన నలుగురు కమతగాళ్ళను వెంటబెట్టుకుని చేనుదగ్గిరికి వెళ్లేసరికి శివయ్య చేలో ఉన్నాడు. శివయ్య తనకు అంగబలంగా గూడెంనుంచి తెచ్చిన ఐదుమందీ వెంకట్రామయ్య రావటం చూసి చల్లగా ముఖం తప్పించారు. వెంకట్రామయ్య మర్యాదగా "చేలోనుంచి అవతలికి వెళ్లు!" అని రెండుమూడుసార్లు చెప్పాడు శివయ్యకి.

శివయ్యమాత్రం కదలకండా "ఈ పొలం నాది!" అనటం మొదలుపెట్టాడు.

శివయ్య అంత మొండి సమాధానం చెప్తుంటే వెంకట్రామయ్యకు రక్తనాళాలు బ్రద్దలౌతున్నట్లనిపించింది. ఎలాగో సంబాళించుకుని "సిగ్గులేదూ ఆమాట అనటానికి?" అన్నాడు.

"సిగ్గుంటే ఎకరం పదిహేనువందల చొప్పున తేరగా కొందామనుకోవు ఈ రోజుల్లో..." అన్నాడు శివయ్య మొరాయిస్తూ.

అశనిపాతంలాంటి ఈ మాటల్తో వెంకట్రామయ్య తన్ని తాను తట్టుకోలేకపోయాడు. చేతికర్ర ఎత్తి శివయ్యతలపైన బలంగా కొట్టాడు.

శివయ్య కొద్ది క్షణాలకి తెప్పరిల్లి, మొండివాడు గనక, ఊళ్లోకన్నా వెళ్ళకండా అటునుంచి అటే బందరు బయలుదేరాడు దావా ఇవ్వటానికి వెంకట్రామయ్య మీద.

మధ్యాహ్నం భోజనాలయ్యాక వెంకట్రామయ్య కరణం గుర్నాధాన్ని వెంట బెట్టుకుని బందరు వచ్చి ప్లీడరుసలహా తీసుకుని తను కొన్న పొలం శివయ్య అన్యాయంగా ఆక్రమించుకుంటున్నాడని సమన్లు జారీచేయించాడు.

ఈ విషయం తెలిసినవెంటనే శివయ్య మరోకసారి బందరుపోయి ప్లీడర్ని విచారించి తను మతిస్థిమితం లేనివాణ్ణనీ, అందువల్ల తనను మోసపుచ్చి ... ఎకరం మూడువేల మూడువందల ధర ఉంటుండగా, పదిహేను వందల చొప్పున తన చేత రాయించుకున్నాడు వెంకట్రామయ్యఅనీ తన మైనరు కొడుకులచేత వాజ్యం వేయించాడు.

* * *

వియ్యమ్మ రెక్కగూటిమీది పుండు నయమై కొడుకును వెనకేసుకొచ్చి వెంకట్రామయ్యగారి కుటుంబాన్ని తన సహజ ధోరణిలో ఫెళఫెళా తిడుతూనే వుంది.

అసలువిషయం - ఈ వ్యవహారంలో గుర్నాధంగారి శీలాన్ని శంకించనివాడు ఆ ఊళ్లోనే లేదు.

మిగతా విషయాలు బందరు కోర్టులో!

★

ఉత్తమ శైవమతగ్రంథము

పండితారాధ్యచరిత్ర

వెల రు 5-0-0 లు

ప్యాకింగిపోస్టేజి రూ. 1-4-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.